క్లుప్తంగా

నేడు ఆలయ భూముల కౌలు వేలం

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామంలో వెలసియున్న శ్రీ మండెం లక్ష్మీ నరసింహస్వామి ఆలయ భూములను ఈ నెల 9వ తేదీన దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో కౌలుకు వేలంపాటను నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కొండారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆలయ భూములు కౌలువై ఉన్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం ఉదయం 10 గంటలకు కౌలు వేలం చేస్తామన్నారు. ఆసక్తి గల వారు ఆలయ కార్యనిర్వహణాధికారిని సంప్రదించాలని సూచించారు.

డీఎల్‌పీఓ ఆకస్మిక తనిఖీ

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె, పాటూరులో జరుగుతున్న శానిటేషన్ పనులను రాజంపేట డీఎల్‌పీఓ మస్తాన్‌వలీ మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆయన ఆయన మాట్లాడుతూ మండలంలోని నందలూరు, నాగిరెడ్డిపల్లె, ఆడపూరు, పాటూరు, వైసి పల్లె గ్రామ పంచాయతీలు ఐవీఆర్ఎస్ శానిటేషన్‌కు ఎంపికైనట్లు తెలిపారు. పాటూరులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.

బీఎల్‌ఓలకు శిక్షణా తరగతులు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని ఎంపీడీఓ సభా భవనంలో నియోజకవర్గంలోని 5 మండలాలోని బూత్ లెవల్ ఆఫీసర్లకు ఓబులవారిపల్లి మండలంలో తహసీల్దార్ యామిని ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ వారి ఎన్నికల బూత్ పరిధిలో పూర్తి అవగాహన ఉండాలని తెలిపారు.

హిందీ మెటీరియల్ పంపిణీ

పుల్లంపేట : మండల పరిధిలోని బావికాడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ ప్రతి ఏడాది లాగానే ఈ ఏడాదీ పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా హిందీ మెటీరియల్ అందజేశారు.

అభ్యంతరాలు తెలపండి

చిన్నమండెం : అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో ఫిర్యాదుల విభాగాన్ని ప్రారంభించినట్లు మండల వ్యవసాయాధికారిణి గీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక పరిశీలనలో తిరస్కరించిన రికార్డులు, తహసీల్దార్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న రికార్డులు గ్రీవెన్స్ మాడ్యూల్‌లో పొందుపరచడం జరిగిందన్నారు. ఏదైనా అభ్యంతరాలు ఉన్న రైతులు తమ తమ రైతు సేవా కేంద్రాలను సంప్రదించి ఈ నెల 13వ తేదీ లోపు అభ్యంతరాలను తెలపాలన్నారు.

రైతులను ఆదుకోవాలి

నందలూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల చెట్లు నాటే కార్యక్రమాన్ని పాటూరు గ్రామ పంచాయతీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి పాల్గొని చెట్లు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాధాకృష్ణన్, ఏపీఓ మురళి, మండల కోఆప్షన్ సభ్యులు కరీముల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయాలి

రాయచోటి జగదాంబసెంటర్ : కలెక్టరేట్ కార్యాలయ సమీపంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు కోరారు. మంగళవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వివిధ రకాల సమస్యలపై రోజువారీగా వందలాది మంది ప్రజలు కలెక్టర్ కార్యాలయం, సమీపంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు వస్తుంటారని బయట హోటళ్లలో ప్లేటు భోజనం చేయాలంటే ఖర్చుతో కూడుకుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని నూతనంగా ప్రారంభించబోయే అన్నా క్యాంటీన్‌ను కలెక్టర్ సమీపంలో ఏర్పాటు చేయాలని కోరారు.

రేపు అలంకరణలో భద్రకాళి

రాయచోటి టౌన్ : వీరభద్రస్వామి ఆలయంలో వెలసిన భద్రకాళి అమ్మవారిని గురువారం శాకాంబరీ దేవిగా అలంకరించనున్నట్లు ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి తెలిపారు.

రాయచోటి దప్పిక తీర్చిన దార్శనికుడు

- మహానేత వైఎస్సార్ సేవలు గుర్తు చేసుకున్న నాయకులు
- వాడవాడలా వైఎస్సార్ జయంతి వేడుక
- పెద్దసంఖ్యలో హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



రాయచోటి టౌన్: వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మహిళా నాయకులు



రామాపురంలో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డి తదితరులు



రాయచోటి: వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా తదితరులు

రాయచోటి : మహానేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ 76వ జయంతి వేడుకలను రాయచోటిలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్, పీలేరు రోడ్డు, రింగ్ రోడ్డు సర్కిల్‌లో వైఎస్సార్ విగ్రహాలకు మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా స్థానిక కౌన్సిలర్లు, నాయకులు కలసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. రాయచోటి రూరల్ మండల పరిధిలోని దిగువ అబ్బవరం, శిబ్యాల, మాధవరం, ఎండపల్లి, గొర్లమద్దివేడు గ్రామాలలోని వైఎస్సార్ విగ్రహాలకు స్థానిక నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి జయంతి ఉత్సవాలను ఘనంగా జరిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, వైఎస్సార్ సిపి జిల్లా ఉపాధ్యక్షుడు పల్లపు రమేష్, పట్టణ అధ్యక్షుడు నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆ మహానేత చిరస్మరణీయుడు

రాయచోటి టౌన్ : మహిళల కోసం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిరస్మరణీయుడు అని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ పర్వీన్, రాయచోటి పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు నాజమీన్‌లు అన్నారు. మంగళవారం పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద మహిళ నాయకులు డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలానే రాయచోటి రూరల్ పరిధిలోని అబ్బవరం గ్రామంలోని కుమ్మరపల్లె రాజంపేట రోడ్డులో వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, గంగిరెడ్డిలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల ఆద్యుడు వైఎస్‌ఆర్

చిన్నమండెం : అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రదాత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వైఎస్‌ఆర్ జయంతి సందర్భంగా మండలంలో చిన్నమండెం, కేశాపురం, మల్లూరు క్రాస్, సాకిబండలలో వైఎస్‌ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి కేకులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవనాథరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, 108, 104, అర్హులందరికీ ఇండ్లు, ఉచిత విద్యుత్, రుణమాఫీ, ఫీజురీయింబర్స్‌మెంట్ తదితర ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఏజాజ్ అలీఖాన్, రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్ తిమ్మారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ చుక్కా అంజనప్ప, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాత వైఎస్ రాజశేఖర్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : పేద ప్రజల ఆశాజ్యోతి, అభివృద్ధి ప్రదాత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని లక్కిరెడ్డిపల్లి ఎంపీపీ మద్దిరేవుల సుదర్శ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్యలు పేర్కొన్నారు. మంగళవారం వైఎస్సార్ జయంతి సందర్భంగా లక్కిరెడ్డిపల్లి మూడు రోడ్ల కూడలిలో వైఎస్ కాంస్య విగ్రహానికి గజమాలలు వేసి నివాళులర్పించి జోహార్ వైఎస్సార్, జై జగన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దస్తగిరి, గంగమ్మ ఆలయ మాజీ చైర్మన్ నరసింహారెడ్డి, చెంద్రాయుడు, ఉప సర్పంచ్ రాజారెడ్డి, వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షులు జగన్నాథ నాయుడు, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు జాకీర్, బాబ్జాన్, సాహెబ్, నవాజ్, తనీ్వర్, మన్సూర్, సయ్యద్ ఇర్షాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మరపురాని మహానేత వైఎస్సార్

రామాపురం (రాయచోటి) : పాలనలో ప్రజలకు సేవ, సంక్షేమం, అభివృద్ధితో ప్రజలందరి గుండెల్లో మరపురాని నేతగా వైఎస్సార్ నిలిచిపోయారని లక్కిరెడ్డిపల్లి మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. మంగళవారం మహానేత వైఎస్సార్ 76వ జయంతిని పురస్కరించుకొని రామాపురం మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి స్థానికులతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహానేత పాలనా కాలంలో లక్కిరెడ్డిపల్లి, రాయచోటి ప్రాంతాలలో జరిగిన అభివృద్ధి నేటికీ కళ్ల ఎదుట కనిపిస్తుందని మాజీ ఎమ్మెల్యే అన్నారు.

సంబేపల్లె మండలంలో..

సంబేపల్లె : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను మండల వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలోని వైఎస్‌ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, చిదంబర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథ్ రెడ్డి, వి.వి.ప్రతాప్‌రెడ్డి, రమణారెడ్డి, అమరనాథ్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, అశోక్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రమణారెడ్డి, రామచంద్ర, నాగరాజుయాదవ్‌లు పాల్గొన్నారు.

గాలివీడులో..

గాలివీడు : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను మండల వ్యాప్తంగా వాడవాడలా వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేకులు, స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం మండల పార్టీ కన్వీనర్ మిట్టపల్లి యదుభూషన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల నాగభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి మన నుంచి దూరమైనప్పటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. ఆయన హయాంలో వెలిగల్లు ప్రాజక్టు నిర్మించి జాతికి అంకితం చేయడం జరిగిందని, ఈ ప్రాంతంలో పూరి గుడిసెలకు స్వస్థిపాలికి పేదలకు పక్కా భవనాలను ఏర్పాటు చేయించారు. మారుమూల గ్రామీణ ప్రాంతాలకు తారురోడ్డు ఏర్పాటు చెయ్యడం, రాయచోటి, గాలివీడు పట్టణాలకు తాగునీరు అందించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లక్కిరెడ్డిపల్లె: రామాపురం మండలంలోని వృద్ధాశ్రమంలో ఆహారం వడ్డిస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం



చిన్నమండెం: భారీ కేక్ కట్ చేస్తున్న దేవనాథరెడ్డి, నాయకులు



గాలివీడు మండల కేంద్రంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న నాయకులు



సంబేపల్లె: మండల కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



లక్కిరెడ్డిపల్లె: మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద..

మండలాభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్

పెనగలూరు : మండల అభివృద్ధికి పాలకులు, అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వైస్ ఎంపీపీ కొండూరు విజయ్ రెడ్డి కోరారు. మంగళవారం ఎంపీపీ సౌందర్య అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మండల సమావేశం జరిగింది. ఎమ్మెల్యేతోపాటు ఖాదీ చిన్న పరిశ్రమల శాఖ చైర్మన్ కేకే చౌదరిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్ రెడ్డి మాట్లాడుతూ పెనగలూరు మండలంలోని గ్రామాలలో అభివృద్ధి చేసేందుకు అధికారులు, పాలకులు కృషి చేయాలని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలను తీర్చేందుకు ముందుంటానన్నారు. ఎంపీడీఓ విజయారావు మాట్లాడుతూ పీ4 సర్వే దాదాపు పూర్తి కావచ్చిందని వారు తెలిపారు. మండలంలో 1527 కుటుంబాలు పేద వారు ఉన్నట్లు గుర్తించామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు సౌందర్య, జెడ్పీటీసీ సభ్యులు సుబ్బరాయుడు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీల నియంత్రణకు స్పెషల్ పోలీసు టీంలు

సిద్దవటం : తరచూ జరిగే చోరీల నియంత్రణకు రెండు బృందాలుగా స్పెషల్ పోలీసు టీమ్‌లను ఏర్పాటు చేశామని ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ చోరీల నియంత్రణను కట్టడి చేసేందుకు ఈ స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. స్థానిక ప్రజల సహకారం మాకు ఎంతో అవసరమని, అనుమానాస్పద వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే వెంటనే సమాచారం తెలపాలని కోరారు.

సూర్యచంద్రులు ఉన్నంత కాలం వైఎస్సార్ పథకాలు శాశ్వతం

- రాజంపేట నియోజకవర్గంలో వేడుకగా వైఎస్సార్ జయంతి
- పెద్దసంఖ్యలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



సుండుపల్లె: వైఎస్‌ఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మండల నాయకులు, కార్యకర్తలు



రాజంపేట టౌన్: ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం



రాజంపేట టౌన్: ఆహారం వడ్డిస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి, పోలా శ్రీనివాసులరెడ్డి



నందలూరు: కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ మేడా, నాయకులు

రాజంపేట టౌన్ : ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత విద్యుత్, పేదలందరికి ఇళ్లు, 104, 108 ఇలా అనేక పథకాలు అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మనసారా స్మరించుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం వైఎస్సార్ జయంతి వేడుకలు పండుగ వాతావరణంలో జరిగాయి. రాజంపేటలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలను ఆయన సోదరుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. తొలుత పాతబస్టాండ్ సర్కిల్‌లోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆకేపాటి అనిల్, నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించారు. ఈ సందర్భంగా పేదలకు పెద్దఎత్తున ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో నాయకులు స్వయంగా పేదలకు భోజనం వడ్డించారు. ఇదిలావుంటే పాతబస్టాండు సర్కిల్‌లో ప్రదర్శించిన కోలాటం విశేషంగా ఆకట్టుకుంది.

సిద్దవటంలో..

సిద్దవటం : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతి వేడుకలను మంగవారం మండల వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని భాకరాపేట మూడురోడ్ల కూడలిలో ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి మండల వైఎస్‌ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాలభిషేకం చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి జోహార్ వైఎస్‌ఆర్, అంటూ నినాదించారు.

రాజన్న సేవలు చిరస్మరణీయం

నందలూరు : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం డాక్టర్ వైఎస్‌ఆర్ 76వ జయంతిని పురస్కరించుకుని స్థానిక బస్టాండ్ కూడలిలోని వైఎస్‌ఆర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి పూలమాలలను వేశారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం మండల మహిళా అధ్యక్షురాలు పల్లె మాధవి ఆధ్వర్యంలో పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

వీరబల్లిలో..

వీరబల్లి : మండలంలోని వివిధ గ్రామాలలో వెలసిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు ఆయా పంచాయతీల పరిధిలోని వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఒంటిమిట్టలో రక్తదానం

ఒంటిమిట్ట : రెండు రాష్ట్రాల తెలుగు ప్రజల గుండెల్లో నిలిచిపోయిన ఏకైక ముఖ్యమంత్రి మన దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని రాజంపేట వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఆకేపాటి అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం వైఎస్సార్ జయంతి సందర్భంగా నాయకులు హరిప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకకు ముఖ్య అతిథులుగా రాజంపేట వైఎస్సార్ సిపి ఇన్‌చార్జ్ ఆకేపాటి అనిల్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర మాజీ డైరెక్టర్లు ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అలాగే అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ఏర్పాటు చేసి వడ్డించారు.



వీరబల్లి: వైఎస్సార్ జయంతి వేడుకలో నాయకులు



సిద్దవటం: భాకరాపేటలో వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న నాయకులు

సుండుపల్లెలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల సందడి

సుండుపల్లె : దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలను సుండుపల్లెలో ఘనంగా నిర్వహించారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ రామస్వామిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

రైతు బాంధవుడు డాక్టర్ వైఎస్సార్

- డాక్టర్ వైఎస్సార్ విగ్రహాలకు పాలాభిషేకం
- రైల్వేకోడూరులో రక్తదాన శిబిరం



రైల్వేకోడూరు అర్బన్: రక్తదానం చేస్తున్న దృశ్యం



రైల్వేకోడూరు అర్బన్: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్రంలో రైతాంగం గురించి ఆలోచించి వారి శ్రేయస్సు కోసం బతికినంత కాలం తపించిన నాయకుడు డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మాత్రమేనని వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం దివంగత సీఎం వైఎస్‌ఆర్ జయంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలతో నివాళి అర్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. జిల్లా యువజన అధ్యక్షుడు వెలగచర్ల శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, తోట శివసాయి, సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర, హరికృష్ణారెడ్డి, చెంగల్‌రెడ్డి, ఆర్వీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేదవాడి గుండెలో వైఎస్సార్

ఓబులవారిపల్లె : ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేదవారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని మండల అధ్యక్షులు వత్తలూరు సాయికిషోర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా చిన్నఓరంపాడు అడ్డరోడ్డులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి పార్టీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు టంగుటూరు కృష్ణారెడ్డి, సర్పంచులు జైపాల్ రెడ్డి, మల్లెం ఈశ్వరయ్య, సుంకేసుల రఫీ, రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షులు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గూడూరు గౌరీశంకర్ రాజు, మాజీ సర్పంచ్ ముక్కా రమేష్ కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పసుపులేటి సుబ్బరాయుడు, సిగమాల సతీష్ కుమార్ రెడ్డి, ఎంపీటీసీ యు.రమేష్ రాజు, దుర్గాప్రసాద్, నరసింహ, వంకన సుదర్శన్ రెడ్డి, పాపుగారి వెంకటసుబ్బారెడ్డిలు పాల్గొన్నారు.

పెనగలూరులో..

పెనగలూరు : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వేడుకలను పెనగలూరు మండలంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, మండల వైస్ ఎంపీపీ విజయ్ రెడ్డిల ఆధ్వర్యంలో జయంతి వేడుకలను పెద్దఎత్తున నిర్వహించారు. కాగా మండలంలోని నల్లపురెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి టపాసులు పేల్చుతూ, భారీ కేక్‌ను కట్ చేసి వైఎస్సార్ జన్మదిన వేడుకను జరిపారు.

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు

పుల్లంపేట : పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని పుల్లంపేట మండల కన్వీనర్ సయ్యద్ ముస్తాక్, ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం డాక్టర్ వైఎస్సార్ జయంతి సందర్భంగా పుల్లంపేట బైపాస్ వద్ద ఉన్న వైఎస్సార్ కాంస్య విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గీతా దేవి, నాయకులు రామనాథం, కుమార్ రెడ్డి, మూరి శంకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హరినాథ రెడ్డి, ఆలం చెంగయ్య, బికె మణి, పెరియవరం పుల్లయ్య, సుదర్శన్ రెడ్డి, సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, భాస్కర్ రెడ్డి, ధనుంజయరెడ్డి, రాజారెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.



పుల్లంపేట: జోహార్ వైఎస్సార్.. జై జగన్ అంటూ నినదిస్తున్న పార్టీ శ్రేణులు



పెనగలూరు: కేక్‌ను కట్ చేస్తున్న కొండూరు అజయ్‌రెడ్డి సోదరులు, నాయకులు



ఓబులవారిపల్లె: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



పెనగలూరు: నల్లపురెడ్డిపల్లి గ్రామంలో..

ఆ అయ్యవారుపై.. అంతులేని అభిమానం

సంబేపల్లె : సుమారు మూడు దశాబ్దాల క్రితం మండలంలోని దుద్యాల గ్రామం పెద్దజంగంపల్లెలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాడు ఆ ఉపాధ్యాయుడు. అంతేకాదు గ్రామస్తులతో కలసిపోయాడు.. ఊరిలో ఒకడిలా మెలిగాడు. గ్రామస్తులతో ఆయన ఏర్పర్చుకున్న ఆదరాభిమానులు మూడు దశాబ్దాలు తరువాత సైతం మర్చిపోలేని మధురానుస్మృతులను అందించాడు. దీంతో పెంజంగంపల్లె గ్రామస్తులు చిన్నమండెం మండలం చిన్నర్సుపల్లె ప్రాథమిక పాఠశాలలో ఎం.రెడ్డయ్య ఉపాధ్యాయుడిగా పని చేస్తూ, ఇటీవల పదవీ విరమణ పొందడంతో మంగళవారం ప్రత్యేకంగా సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తొలుత ఉపాధ్యాయుడిని ఆయన సతీమణిని గ్రామంలో డప్పువాయిద్యాల నడుమ ఊరేగించి శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందజేసి తమ గురుభక్తిని చాటారు. అనంతరం పెద్దజంగంపల్లె ప్రాథమిక పాఠశాలలో నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను గ్రామస్తులు సన్మానించారు.



టీచర్ రెడ్డయ్య దంపతులను సన్మానిస్తున్న పెద్దజంగంపల్లె వాసులు